సాక్షి చిత్తూరు

సోమవారం । 3 । జూలై । 2023



జనసంద్రంగా బోయకొండ

బోయకొండ గంగమ్మ పుణ్యక్షేత్రానికి ఆదివారం 65 వేలమంది తరలి రావడంతో భక్తజనసంద్రంగా మారింది. –8లో



సరికొత్తగా రైల్వే సిగ్నలింగ్

అరక్కోణం నుంచి రేణిగుంట రైల్వేస్టేషన్ వరకు చేపట్టిన రైల్వే సిగ్నలింగ్ వ్యవస్థ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. –8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	33	25
తిరుపతి	32	24
తిరుమల	29	21
గూడూరు	35	27
నగరి	33	26

న్యూస్‌రీల్

రాజన్నతోనే చిత్తూరుకు సీఎంసీ...!



సీఎంసీలో సాగుతున్న శంకుస్థాపన పనులు

చిత్తూరు రూరల్: జిల్లా వాసులకు మెరుగైన వైద్యం అందాలనే ఉద్దేశంతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంసీ (క్రిష్టియన్ మెడికల్ కాలేజీ) నిర్మాణానికి పునాది వేశారు. ఇందుకు చీలాపల్లి, బొమ్మసముద్రం ప్రాంతాల్లో 640 ఎకరాల భూమిని కేటాయించారు. ఆస్పత్రి నిర్మాణం తర్వాత 350 మంది స్థానికులకు ఉపాధి లభించింది. సీఎంసీ వైద్యం జిల్లావాసులకు అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం రోజువారీ ఓపీ 1000 దాటుతోంది. అత్యవసర చికిత్సకు 60 ఓపీలు వస్తున్నాయి. ఈ క్రమంలో ఆస్పత్రిని మరింత అభివృద్ధి చేయాలని ఆ డైరెక్టర్లు నిర్ణయం తీసుకున్నారు. 300 పడకల ఆస్పత్రి నిర్మాణ పనులను చేపట్టాలని పూనుకున్నారు. ఇందుకు ముహూర్తం ఖరారు చేసి రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆహ్వానించారు. ఆయన చేతుల మీదుగా శంకుస్థాపన చేసి 300 పడకల నిర్మాణ పనులను ప్రారంభించనున్నారు. ఈ పనులు పూర్తయిన తర్వాత 500 నుంచి 600 మందికి ఉపాధి లభించవచ్చని ఆస్పత్రి నిర్వాహకులు చెబుతున్నారు.

ఏడాది నాటి సమస్య పరిష్కారం



సర్టిఫికెట్‌తో గౌరమ్మ

గంగవరం: మండలంలోని కీలపట్ల దళితవాడకు చెందిన గౌరమ్మ, భర్త వెంకటేష్, ఇద్దరు పిల్లలు, అత్త, మామ మొత్తం ఆరుగురు కలిపి ఒకే రేషన్ కార్డులో ఉండేవాళ్లు. రెండేళ్ల క్రితం హౌస్‌హోల్డ్ స్ప్లిట్(రేషన్ కార్డు విభజన)కు గ్రామ సచివాలయంలో అర్జీ పెట్టుకోగా కొత్త రేషన్ కార్డును ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే కొత్త కార్డు మంజూరైనా గ్రామ వలంటీర్ లాగిన్‌లో మాత్రం అందరూ ఒకే కార్డులో ఉన్నట్టుగానే చూపించేది. అప్పటి నుంచి కలెక్టర్ స్పందనలో విన్నవించినా సమస్య పరిష్కారం కాలేదు. అయితే ఏడాది కిందట భర్త వెంకటేష్ మృతి చెందాడు. వితంతు పింఛన్ కోసం అర్జీ పెట్టుకుంటే రేషన్‌కార్డు ఒక్కటిగానే చూపించడంతో పింఛన్ మంజూరు కాలేదు. ప్రస్తుతం జగనన్న సురక్షలో అర్జీ పెట్టుకోగా ఒకే రోజులో అధికారులు సమస్య పరిష్కరించారు. అత్త, మామల కార్డులో ఉన్నట్టుగా చూపుతున్న పేర్లను ఆన్‌లైన్‌లో తొలగించడంతో ఎట్టకేలకు సమస్య పరిష్కారమైంది.

నేడు పోలీసు స్పందన రద్దు

చిత్తూరు అర్బన్: నగరంలోని పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు ఎస్పీ వై.రిశాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం పర్యటన నేపథ్యంలో ఈ వారం స్పందనను రద్దు చేస్తున్నామని, ప్రజలు గమనించాలని ఆయన పేర్కొన్నారు.

ప్రశాంతంగా యూపీఎస్సీ పరీక్షలు

తిరుపతి అర్బన్: నగరంలో ఆదివారం యూపీఎస్సీ పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు. మొత్తం 8 కేంద్రాల్లో రెండు సెషన్లలో పరీక్షలు జరిగాయి. అభ్యర్థులకు మెరుగైన వసతులు కల్పించారు. ఉదయం 9.30–11.30 గంటల వరకు జరిగిన పరీక్షకు 3,793 మందికి గాను 1,516 మంది మాత్రమే హాజరయ్యారు. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు నిర్వహించిన పరీక్షకు 3,953 మందికి గాను 1,503 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు.

జన సురక్ష

ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు సుబ్బమ్మ. పాలసముద్రం మండలం వనదుర్గాపురంలో నివసిస్తున్నారు. కూలి పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వనదుర్గాపురం సచివాలయంలో తొలిరోజు నిర్వహించిన జగనన్న సురక్ష క్యాంపులో కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌ను పొందారు. ఈ సర్టిఫికెట్ల కోసం రూ.500 వరకు ఖర్చు చేసి, మీ సేవ కేంద్రాల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఉండేది. నాలుగు రోజుల క్రితం జగనన్న సురక్ష పథకంలో భాగంగా తన ఇంటికి వెళ్లిన వలంటీర్లు కుల ధ్రువీకరణ పత్రం అవసరమని గుర్తించి దరఖాస్తు చేయించారు. సర్టిఫికెట్లను పొందడంతో ఎంతో మేలు కలిగిందని సుబ్బమ్మ ఆనందం వ్యక్తం చేశారు.



సర్టిఫికెట్‌ను చూపుతున్న సుబ్బమ్మ



తిరుపతిలో సర్టిఫికెట్లు పొందిన లబ్ధిదారులు

ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రజల వినతులను సంతృప్తి స్థాయిలో పరిష్కరించడం కోసం చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో షెడ్యూల్ ప్రకారం ఆయా సచివాలయాల్లో క్యాంపులను నిర్వహిస్తున్నారు. ఈ మేరకు 1వ తేదీన నిర్వహించిన క్యాంపులకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. జగనన్న సురక్ష క్యాంపుల వల్ల తమకు మేలు కలిగిందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 3న పలు మండలాల్లోని సచివాలయాల్లో క్యాంపులు నిర్వహించనున్నారు.

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పకడ్బందీగా క్యాంపులు
- పర్యవేక్షిస్తున్న కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు
- జగనన్న సురక్ష క్యాంపులకు అద్భుతమైన స్పందన
- ఈ నెల 31 వరకు గుర్తించిన ఆయా సచివాలయాల్లో క్యాంపులు

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లు, వివిధ ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వ సేవలను జగనన్న సురక్ష క్యాంపులలో పరిష్కరిస్తున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న సురక్ష క్యాంపులకు విశేష స్పందన



గుడిపాల వసంతాపురం సచివాలయంలో శనివారం సర్టిఫికెట్లు అందజేస్తున్న సిబ్బంది

లభిస్తోంది. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రతి ఒక్కరి సమస్యలను పరిష్కరించడం కోసం ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రజల ముందుకు తీసుకొచ్చింది. చిత్తూరు జిల్లాలో నిర్వహిస్తున్న క్యాంపులను కలెక్టర్ షణ్మోహన్, తిరుపతి జిల్లాలో కలెక్టర్ వెంకటరమణారెడ్డి పర్యవేక్షిస్తున్నారు. మండల స్థాయి అధికారులు తహసీల్దార్, ఈవోపీఆర్డీ, ఎంపీడీవో, డిప్యూటీ తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్లు క్యాంపులలో పాల్గొంటున్నారు.

ప్రజలకు ఉచితంగా సేవలు

సురక్ష క్యాంపులలో ప్రజలకు ఉచితంగా 11 రకాల సేవలందిస్తున్నారు. జగనన్న సురక్షలో కుల, ఆదాయ, వివాహ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కు మొబైల్ నంబర్ అనుసంధానం, మ్యూటేషన్ లావాదేవీలు, ఫ్యామిలీ మెంబర్ల సర్టిఫికెట్, పంట సాగుహక్కు పత్రం, కొత్త రేషన్ కార్డులు, హౌస్ హోల్డింగ్ మ్యాప్ వంటి 11 రకాల సేవలను ఉచితంగా అందిస్తున్నారు. అక్కడికక్కడే ప్రజలకు సర్టిఫికెట్లను అందిస్తున్నారు. ఈ నెల 1న చిత్తూరు జిల్లాలో 45 సచివాలయాల్లో, తిరుపతి జిల్లాలో 35 సచివాలయాల్లో క్యాంపులు నిర్వహించారు. చిత్తూరు జిల్లాలో 41,666, తిరుపతి జిల్లాలో 33,924 కుటుంబాలకు మేలు కలిగిందని అధికారులు వెల్లడించారు. చిత్తూరు జిల్లాలో 7,882, తిరుపతి జిల్లాలో 18,262 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లను ఉచితంగా తొలిరోజు క్యాంపులో అందజేశారు. వివిధ విద్యాసంస్థల్లో అడ్మిషన్ల సమయం కావడంతో జగనన్న సురక్ష క్యాంపులను వినియోగించుకున్నామని విద్యార్థులు సంతోషం వ్యక్తంచేశారు. సచివాలయాల్లో అందుబాటులో ఉన్న దరఖాస్తులను పూర్తిచేసి చాలామంది రైతులు సీసీఆర్సీ కార్డులు పొందారు. రైతుల్లో ఉన్న ఆందోళనను దూరం చేసి, కౌలు రైతులకు మేలు చేకూర్చడంలో క్యాంపులు బాగా ఉపయోగపడ్డాయని సంతోషం వ్యక్తంచేశారు.

పకడ్బందీగా జగనన్న సురక్ష క్యాంపులు



ప్రభుత్వ ఆదేశాల మేరకు జగనన్న సురక్ష క్యాంపులను పకడ్బందీగా నిర్వహిస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఈ కార్యక్రమం వల్ల కలిగే మేలు ప్రజలకు క్షేత్రస్థాయి అధికారులు అవగాహన కల్పించారు. ప్రజలు ఈ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి.

– సగిలి షణ్మోహన్, కలెక్టర్, చిత్తూరు

అప్పటికప్పుడే బర్త్ సర్టిఫికెట్



గతంలో నేను నా బర్త్ సర్టిఫికెట్ కోసం ఎన్నిసార్లు తిరిగినా అందలేదు. ప్రస్తుతం జగనన్న సురక్ష సర్వేలో మా ఇంటికే సర్వేకు వచ్చిన వారికి నా సమస్యను విన్నవించుకున్నా. బర్త్ సర్టిఫికెట్‌కు వారు అడిగిన పత్రాలు అందజేశా. ఎలాంటి ఖర్చు లేకుండా సురక్ష క్యాంప్‌లో బర్త్ సర్టిఫికెట్ అందజేశారు.

– దుర్గ, పుత్తూరు

నిత్యం పర్యవేక్షణ



తిరుపతి జిల్లా పరిధిలో ఈ నెలాఖరు వరకు నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ఆయా సచివాలయాల్లో జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహిస్తున్నాం. క్యాంపుల నిర్వహణ తేదీని ప్రజలకు ముందస్తుగానే వలంటీర్ల ద్వారా తెలియజేస్తాం వారు వినియోగించుకునేలా చర్యలు చేపడుతున్నాం.

– కె.వెంకటరమణారెడ్డి, కలెక్టర్, తిరుపతి

ప్రభుత్వ సేవలు చాలా బాగున్నాయి



ఇంటికి వచ్చిన వలంటీర్ వద్ద నేను కుల, ఆదాయ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు పెట్టుకున్నాను. గతంలో ప్రభుత్వ కార్యాలయం చుట్టూ తిరిగి పొందే పరిస్థితి ఉండేది. మా సచివాలయంలో నిర్వహించిన క్యాంపులో అధికారులు సర్టిఫికెట్లు అందించారు. ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.

– మల్లీశ్వరి, ఎస్టీ కాలనీ, బరాల

గంటలో రేషన్ కార్డు



మాది విజయపురం మండలం మిట్టూరు గ్రామం. రేషన్ కార్డు విభజించి ఇవ్వాలని జగనన్న సురక్ష క్యాంప్‌లో అర్జీ ఉంచుకున్నాను. గంట సమయంలో రేషన్ కార్డు విభజన చేసి నాకు కొత్త రేషన్‌కార్డు అందించారు. ముఖ్యమంత్రి జగనన్నకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.

– హిమబిందు, విజయపురం

రేపు చిత్తూరుకు సీఎం రాక

- నగరంలో భారీ కటౌట్లు, స్వాగత తోరణాలు
- సభా స్థలిలో ఏర్పాట్లు పరిశీలించిన యంత్రాంగం

సాక్షి, చిత్తూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈనెల 4వ తేదీ మంగళవారం చిత్తూరుకు రానున్నారు. ఈ నేపథ్యంలో నగరంలో భారీ స్వాగత ఏర్పాట్లు సాగుతున్నాయి. ఇటు అధికారులు అటు పార్టీ శ్రేణులు ఎవరికి వారు, ఎక్కడికక్కడ ఫ్లెక్సీలు, స్వాగత తోరణాల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. వీటితో పాటు పెద్ద ఆర్చిలను సిద్ధం చేస్తున్నారు. సీఎం జగన్ పాల్గొనే సభా ప్రాంగణంలో ఏర్పాట్లు వేగంగా సాగుతున్నాయి. వేలాది మంది ప్రజలు సభలో కూర్చునేందుకు వీలుగా ఏర్పాట్లు చేయటంలో అధికారులు, పార్టీ నేతలు తలమునకలయ్యారు.

చిత్తూరు డెయిరీకి పూర్వ వైభవం

సీఎం జగన్ చిత్తూరు పర్యటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు చేపడుతోంది. క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఏర్పాట్లను ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి, మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పరిశీలించారు. ఏర్పాట్లను కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ రిశాంత్‌రెడ్డి మంత్రులకు వివరించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్తూరు పర్యటన విజయవంతం చేసేందుకు



సభాస్థలి వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, కలెక్టర్ షణ్మోహన్, జెడ్పీచైర్మన్ శ్రీనివాసులు

భారీ స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రులు నారాయణస్వామి, పెద్దిరెడ్డి అన్నారు. చిత్తూరు జిల్లాలోని పాడిరైతులకు మేలు చేసేలా మూత పడిన విజయా డెయిరీని అమూల్ ఆధ్వర్యంలో పునః ప్రారంభిస్తున్నట్లు వివరించారు. విజయా డెయిరీకి అమూల్ సంస్థ పూర్వ వైభవం తీసుకొస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అమూల్ డెయిరీ కారణంగా పాల ధరలు పెరిగి పాడి రైతులకు మేలు జరుగుతోందని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్ ఎన్నికల హామీల్లో భాగంగా ఈ డెయిరీని పునఃప్రారంభిస్తామని మాటిచ్చి నిలబెట్టుకున్నారని గుర్తు చేశారు. ఇదే సందర్భంగా చీలాపల్లి సీఎంసీ ఆవరణలో 300 పడకల ఆస్పత్రి కారణంగా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయన్నారు. మంత్రుల వెంట జేసీ పి.శ్రీనివాసులు, డీఆర్వో ఎన్.రాజశేఖర్, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్, అడిషనల్ ఎస్పీలు శ్రీలక్ష్మి, సుధాకర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, ట్రాన్స్‌కో ఎస్ ఈ కృష్ణారెడ్డి, చిత్తూరు ఆర్డీఓ రేణుక, చుడా చైర్మన్ పురుషోత్తం రెడ్డి, నగర డిప్యూటీ మేయర్ చంద్ర శేఖర్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

బందోబస్తు పటిష్టంగా ఉండాలి

చిత్తూరు అర్బన్: ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో బందోబస్తు పటిష్టంగా ఉండాలని కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ రిశాంత్‌రెడ్డి ఆదేశించారు. పర్యటన నిమిత్తం చిత్తూరు నగరంలోని మెసానికల్ మైదానం, విజయా డెయిరీ, సభ వేదిక వద్ద ఏర్పాట్లను కలెక్టర్, ఎస్పీ రిశాంత్‌రెడ్డి పరిశీలించారు.

ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టండి

చిత్తూరు కలెక్టరేట్ : సీఎం పర్యటనకు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని ఎమ్మెల్సీ, సీఎం ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్ తలశిల రఘురాం అన్నారు. మెసానికల్ మైదానంలో ఆదివారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. అధికారులందరూ సమన్వయంతో పని చేసి, ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలన్నారు. అనంతరం సీఎం పర్యటించే ప్రాంతాలను ఆయన కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ రిశాంత్‌రెడ్డి, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుతో కలిసి పరిశీలించారు.



ఏర్పాట్లపై చర్చిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, మంత్రి పెద్దిరెడ్డి



సిద్ధమవుతున్న బహిరంగసభ



సమీక్షలో పాల్గొన్న ఎమ్మెల్సీ తలశిల రఘురాం

తుది దశకు శ్రీనివాస సేతు



క్రేన్ల సాయంతో ఏర్పాటు చేస్తున్న గడ్డర్లు

తిరుపతి తుడా: నగరంలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న శ్రీనివాస సేతు ఫ్లైఓవర్ తుది దశకు చేరుకుంది. ఆదివారం రామానుజ సర్కిల్ నుంచి ఆర్టీసీ బస్టాండ్‌ను కలుపుతూ, రైల్వేలైన్‌పై రెండు మార్గాలకు ఐరన్ గడ్డర్లు ఏర్పాటు చేసే ప్రక్రియను చేపట్టారు. తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి, రైల్వే ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షించారు. కమిషనర్ మాట్లాడుతూ ఫ్లైఓవర్ పనులు దాదాపు పూర్తయినట్లు వెల్లడించారు. త్వరలోనే నగరవాసులకు శ్రీనివాస సేతును అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. డిప్యూటీ మేయర్ అభినయ్ రెడ్డి మాట్లాడుతూ రైల్వే లైన్‌పై శ్రీనివాస సేతును కలిపే కీలక ప్రకియలో భాగంగా 6 భారీ గడ్డర్లను ఏర్పాటు చేస్తున్నారన్నారు. ప్రస్తుతం రెండు గడ్డర్లను విజయవంతంగా అమర్చారని వెల్లడించారు. రైల్వే వారి సహకారంతో మరో పదిహేను రోజుల్లో అన్ని పనులు పూర్తిచేయనున్నట్లు తెలిపారు. శ్రీనివాస సేతు నిర్మాణ పనుల్లో భాగంగా తొలగించిన మహనీయుల విగ్రహాలను తిరిగి ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మున్సిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, కార్పొరేటర్ లడ్డు భాస్కర్, తిరుపతి రైల్వే స్టేషన్ అధికారులు కుప్పాల సత్యనారాయణ, కృష్ణ, సుబ్బారావు, ఆఫ్కాన్ స్వామి పాల్గొన్నారు.

కిక్కిరిసిన వరసిద్ధుని క్షేత్రం



వినాయకుని సేవలో ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జున రెడ్డి,



భక్తులతో కిక్కిరిసిన క్యూలు,



కూరగాయలు అందజేస్తున్న పలమనేరు మార్కెట్ అసోసియేషన్ సభ్యులు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది. ఆదివారం సెలవు కావడంతో ఉదయం నుంచే భక్తుల తాకిడి పెరిగిపోయింది. స్వామివారి దర్శనార్థం వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. దీంతో అన్ని కంపార్ట్‌మెంట్లు, రూ.150, రూ.100, ఉచిత క్యూలన్నీ భక్తులతో నిండిపోయి ఆలయం వెలుపల వరకు బారులు తీరారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తగు చర్యలు తీసుకొని భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు.

వినాయకుని సేవలో ప్రముఖులు

వినాయక స్వామిని రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జున్ రెడ్డి, రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ పుల్లారావు విడివిడిగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఏఈఓ స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. వేదపండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి చిత్ర పటం తీర్థ ప్రసాదాలు అందించారు.

ఐదు టన్నుల కూరగాయల వితరణ

కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న మణికంఠేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారిని శాకాంబరిగా అలంకరించేందుకు పలమనేరుకు చెందిన మార్కెట్ అసోసియేషన్ సభ్యులు ఐదు టన్నుల కూరగాయలను వితరణగా అందించారు. వారికి ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు. ఆషాఢ పౌర్ణమి సందర్భంగా సోమవారం మణికంఠేశ్వర స్వామి ఆలయంలో దుర్గాదేవికి ప్రత్యేక అభిషేకాలు అలంకరణలు నిర్వహించి పూజలు చేయనున్నారు.

ది బెస్ట్‌గా 'బర్డ్'

- అందుబాటులో అత్యుత్తమ వైద్యసేవలు
- టీటీడీ జేఈఓ సదా భార్గవి
- ముగిసిన ఆర్థో ప్లాస్టీ జాతీయ సదస్సు

తిరుపతి తుడా: తిరుపతిలోని బర్డ్ ఆస్పత్రిని బెస్ట్‌గా తీర్చిదిద్దినట్లు టీటీడీ జేఈఓ సదాభార్గవి తెలిపారు. నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో మూడు రోజులపాటు నిర్వహించిన జాతీయ స్థాయి ఆర్థో ప్లాస్టీ సదస్సు ఆదివారంతో ముగిసింది. ముఖ్యఅతిథిగా హాజరైన జేఈఓ మాట్లాడుతూ బర్డ్ ఆస్పత్రిలో ప్రపంచ స్థాయి వైద్య ప్రమాణాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆర్థోపెడిక్ సమస్యలతో బాధపడుతున్న రోగులు బర్డ్‌లో మెరుగైన చికిత్సలు పొందాలని సూచించారు. మోకీలు, తుంటి మార్పిడికి సంబంధించి అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తున్నారని వెల్లడించారు. ప్రముఖ వైద్యులతో 22 మంది పేద రోగులకు క్లిష్టమైన సర్జరీలను లైవ్‌లో చేశారని తెలిపారు. దేశవ్యాప్తంగా దాదాపు 200 మంది యువ సర్జన్లు ఈ సదస్సులో పాల్గొని లైవ్ ఆపరేషన్లను వీక్షించి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారని వివరించారు. మూడు రోజుల్లో 22 క్లిష్టమైన ఆపరేషన్లు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ఈ సదస్సును విజయవంతంగా నిర్వహించిన బర్డ్ ప్రత్యేకాధికారి డాక్టర్ రాచపల్లి రెడ్డెప్పరెడ్డి, డాక్టర్ ప్రదీప్, డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ దీపక్ బృందానికి జేఈఓ అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని జాతీయ సదస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇంత చక్కటి సదస్సును నిర్వహించేందుకు ఆమోదం తెలిపిన టీటీడీ బోర్డు చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈఓ ఏవీ ధర్మారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. బర్డ్ ప్రత్యేకాధికారి డాక్టర్ రాచపల్లి రెడ్డెప్ప రెడ్డి మాట్లాడుతూ దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి అనేక మంది వైద్య నిపుణులు బర్డ్కు వచ్చి పేదలకు ఉచితంగా ఆపరేషన్లు చేస్తున్నారన్నారు.



ప్రసంగిస్తున్న టీటీడీ జేఈఓ సదా భార్గవి

సేవ చేయడానికి ముందుకొచ్చే డాక్టర్లకు వసతి, రవాణా, భోజనం, తిరుమల శ్రీవారి దర్శనం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. హిప్ రీప్లేస్‌మెంట్ నిపుణుడు, హైదరాబాద్ మెడికవర్ ఆస్పత్రి హెచ్‌ఓడీ డాక్టర్ కృష్ణ కిరణ్ మాట్లాడుతూ సదస్సులో యువ వైద్యులకు సందేహాలను తీర్చడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఇండియన్ ఆర్థోప్లాస్టీ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ రాజీకుమార్ నటేశన్, ఏపీ ఆర్థోపెడిక్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ సునందకుమార్ రెడ్డి, మెడికల్ కౌన్సిల్ అబ్జర్వర్ డాక్టర్ సుబ్బారెడ్డి, బర్డ్ వైద్యులు ప్రదీప్, వేణుగోపాల్, దీపక్, మెరిల్ సంస్థ ప్రతినిధి డాక్టర్ వివేక్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నగలు స్వాధీనం - ఒకరి అరెస్టు



నిందితుడిని అరెస్టు చూపుతున్న పోలీసులు

రొంపిచెర్ల: చోరీ అయిన బంగారు నగలను నగలు స్వాధీనం చేసుకుని, నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్‌ తెలిపారు. ఆయన కథనం మేరకు, బండకిందపల్లె గ్రామ పంచాయతీ కమ్మోళ్లపల్లెకు చెందిన శివరాణి జూన్‌ 26న బంధువుల ఇంటికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేరని తెలుసుకున్న ఐరాల మండలం గాండ్లపల్లె ఎస్టీ కాలనీకి చెందిన వారువారం రాజు (28), ఆ ఇంటి తలుపులు పగలగొట్టి ఇంట్లో బీరువాలో ఉన్న 18 గ్రాముల నగలను చోరీ చేశారు. 30వ తేదీ ఇంటికి వచ్చిన శివరాణి, ఇంట్లో నగలు చోరీ అయిన విషయం గుర్తించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వేలిముద్రల నిపుణులను రప్పించి పరీక్షించి నిందితుడుని రాజుగా గుర్తించారు. అన్నమయ్య జిల్లా పీలేరు క్రాస్‌ రోడ్డులో ఉండగా అరెస్టు చేశామని తెలిపారు. అతని వద్ద నుంచి 18 గ్రాముల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని పీలేరు కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రేషన్‌ తూకం పక్కా

ప్రజాపంపిణీ వ్యవస్థలో పారదర్శకతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఎంఎల్‌ఎస్‌ (మండల్‌ లెవల్‌ స్టాక్‌ పాయింట్‌)లో తూకం తకరారుకు చెక్‌పెట్టింది. తూకం పక్కాగా ఉండేలా చూస్తోంది. డీలర్ల వేలిముద్రలు పడితేనే సరుకు షాపునకు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంది. సరుకుల్లో కోతలు లేకుండా జిల్లా పౌరసరఫరాల సంస్థ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. దీంతో రేషన్‌ సరుకుల కేటాయింపు పకడ్బందీగా సాగుతోంది.

- సరుకుల సరఫరాలో పారదర్శకత
- ఎంఎల్‌ఎస్‌ పాయింట్‌లో అవకతవకలకు చెక్‌
- డీలర్ల వేలిముద్రతోనే సరుకుల పంపిణీ
- కోతలు లేకుండా అధికారులు చర్యలు

చిత్తూరు రూరల్‌: ఎంఎల్‌ఎస్‌ పాయింట్ల నుంచి రేషన్‌ షాపులకు అందే సరుకుల్లో వ్యత్యాసాలు రాకుండా ప్రభుత్వం పక్కా చర్యలు తీసుకుంది. రాష్ట్రస్థాయి ఎంఎల్‌ఎస్‌ పాయింట్ల జిల్లాలోని గోడౌన్లకు బియ్యాన్ని ప్రతినెలా 25 లోపు సరఫరా చేస్తున్నారు. ఈ సమయంలో తప్పనిసరిగా తూకం వేయాల్సి ఉంది. ఇందుకోసం ఎలక్ట్రానిక్‌ కాటాలను ఏర్పాటు చేశారు. రాష్ట్ర స్థాయి ఎంఎల్‌ఎస్‌ పాయింట్ల నుంచి వచ్చిన బియ్యం బస్తాల నుంచి కోతలు పడేవి. అందుకే తూకం వేయకుండానే జిల్లా గోడౌన్ల నుంచి లారీలకు ఎక్కించి రేషన్‌ దుకాణాలకు పంపుతున్నారనే ఆరోపణ ఉంది. వాస్తవానికి ఒక బస్తా గోతాంతో కలిపి 50.6 కిలోల తూకం వంతున డీలర్‌కు ఇవ్వాల్సి ఉంది. కానీ తూకం వేయకుండా సరఫరా చేయడంతో సరాసరి క్వింటాల్‌కు కనీసం రెండు కిలోల చొప్పున తగ్గుతున్నాయనే ఫిర్యాదులు వచ్చేవి. దీని ప్రకారం 160 టన్నుల వరకు తగ్గుతుందనుకుంటే దాని విలువ రూ.4.20 లక్షలు. ఇలా ఏడాదికి దాదాపు రూ. అర కోటిపైనే బియ్యం దుకాణాలకు చేరకుండానే పక్కదారిన పడుతున్నాయనే ఫిర్యాదులు అందేవి. కొన్ని చోట్ల డీలర్లు సైతం తప్పుడు ప్రచారాలు చేస్తూ పంపిణీల్లో కోతలు పెట్టడం, పక్కదారి పట్టిస్తున్నట్లు జిల్లా అధికారులు గుర్తించారు.



స్టాకును తూకం వేస్తున్న అధికారులు

ప్రస్తుతం ఇలా...

గోడౌన్ల నుంచి రేషన్‌ దుకాణానికి అందే సరుకుల సరఫరాలో అక్రమాలు, కోతలు ఉండకూడదని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో జిల్లా పౌరసరఫరాల సంస్థ అధికారులు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే నిత్యావసర వస్తువులను ఆర్‌ఓ ప్రకారం ఉందా..లేదా తూకం వేసి దించుకుంటున్నారు. తర్వాత ప్రతిషాపునకు కూడా తూకం వేసి తరలిస్తున్నారు. డీలర్లు వేలిముద్రలు వేస్తేనే సరకులు ఇచ్చేలా నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్రక్రియతో నేరుగా డీలర్లే వచ్చే సరుకులు తీసుకెళుతున్నారు. దగ్గరుండి తూకం చూస్తున్నారు.

ఉమ్మడి జిల్లా రేషన్‌ సరఫరా వివరాలు...		
రకం	చిత్తూరు	తిరుపతి
గోడౌన్లు	14	16
రేషన్‌ షాపులు	1379	1457
బియ్యం సరఫరా	15 వేల టన్నులు	16 వేల టన్నులు
చక్కెర సరఫరా	3 వేల టన్నులు	4 వేల టన్నులు
కందిపప్పు సరఫరా	5 వేల టన్నులు	6 వేల టన్నులు
వచ్చే నెల నుంచి రాగులు	1,150 టన్నులు	

ఆర్‌ఓ ప్రకారం చూస్తున్నాం..



సరుకుల సరఫరాలో ముందు మాదిరి లేదు. ఇప్పుడు లెక్కలు పక్కాగా చూడాలి. ఆ ప్రకారమే సరుకులు పంపుతున్నాం. దించుకునే సమయంలో కూడా ఆర్‌ఓ ప్రకారం చూస్తున్నాం. కచ్చితంగా ఆ డీలరే వచ్చి వేలిముద్ర పెట్టాల్సి ఉంది. అప్పుడే సరుకులు ఇస్తున్నాం. డీలర్లు కూడా చాలా మంది నిబంధనల ప్రకారమే వచ్చి తీసుకెళుతున్నారు. తూకం చూసుకుంటున్నారు.

–శ్రీనివాసులు, గోడౌన్‌ ఇన్‌చార్జ్‌, చిత్తూరు

పకడ్బందీగా జరుగుతోంది.

గోడౌన్ల నుంచి నిత్యావసర సరుకుల సరఫరా పకడ్బందీగా జరుగుతోంది. కార్యాలయం నుంచి కూడా సరఫరాను పర్యవేక్షిస్తున్నాం. తూకం కరెక్టుగా ఉండాలని గోడౌన్‌ అధికారులకు పదే పదే చెబుతున్నాం. ఆ ప్రకారమే అధికారులు కూడా చూసుకుంటున్నారు. సరఫరాలో మార్పులు వచ్చాయి.

మోహన్‌బాబు,
జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్‌, చిత్తూరు



చిత్తూరు బులియన్‌

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,400

వెండి:

హోల్‌సేల్‌ ధర (కిలో)	రూ.71,000
రిటైల్‌ వెండి గ్రాము	రూ.73.00

వైఎస్సార్‌సీపీ నేత అనుమానాస్పద మృతి



సంఘటనా స్థలంలో బంధువుల రోదనలు

భక్తవత్సలం (ఫైల్‌)

పుత్తూరు రూరల్‌: చిత్తూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి, పూతలపట్టు నియోజకవర్గం, తవణంపల్లె మండలం, వెనగంపల్లెకు చెందిన టి.భక్తవత్సలం(45) దారుణ హత్యకు గురయ్యారు. వడమాలపేట మండలం పాదిరేడు–కదిరిమంగళం హైవే రోడ్డు పక్కన రాములవారి గుడి మాన్యం పొలాల్లో ఆదివారం భక్తవత్సలం మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహంపై కర్రతో బలంగా కొట్టిన గాయాలు ఉన్నాయి. మృతుడి సోదరుడు రాజేష్‌ కథనం మేరకు, భక్తవత్సలం చిన్న కుమార్తె పూజశ్రీని తీసుకొని శనివారం ఉదయం స్వగ్రామం వెనగంపల్లె నుంచి కారులో బయలుదేరి రేణిగుంట మండలం ఎలమణ్యం గ్రామంలో నివసిస్తున్న తమ్ముడు రాజేష్‌ ఇంటికి వచ్చాడు. కూతుర్ని తమ్ముడి ఇంట్లో వదలిపెట్టి 10.30 గంటలకు తిరుపతికి బయలుదేరాడు. మధ్యాహ్నం 2.45 గంటలకు తమ్ముడు రాజేష్‌కు ఫోన్‌ చేసి మాట్లాడాడు. ఆ తర్వాత అతని ఫోన్‌ స్విచ్‌ ఆఫ్‌ అయ్యింది. ఆదివారం ఉదయం భక్తవత్సలం మృతి చెందినట్లు పోలీసుల నుంచి బంధువులకు సమాచారం అందింది. భక్తవత్సలం పార్టీ వ్యవహారాల్లో చురుగ్గా పాల్గొంటూనే, రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారం చేస్తుంటాడు. కొంత కాలంగా వ్యాపార లావాదేవీలకు సంబంధించి కోర్టులో కేసు నిమిత్తం తిరుపతికి వచ్చి వెళ్తున్నట్లు సమాచారం. మృతదేహం వద్ద వైఎస్సార్‌సీపీ ఐడీ కార్డు లభ్యం కావడంతో పోలీసులు మృతుడి ఆచూకీని గుర్తించారు. మృతుడికి భార్య లలిత, ఇద్దరు కుమార్తెలు హేమశ్రీ(20), పూజశ్రీ(17) ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పుత్తూరు రూరల్‌ సీఐ సురేష్‌కు మార్‌ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జనసంద్రంగా బోయకొండ





ప్రత్యేక అలంకారంలో బోయకొండ గంగమ్మ, ఆలయం లోపలికి వెళ్లే మార్గంలో భక్తుల రద్దీ

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయం, పరిసర ప్రాంతాలు ఆదివారం భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఆషాడమాసంతో పాటు, సెలవురోజు కావడం గురు పౌర్ణమి సందర్భంగా అమ్మవారిని అర్చకులు అత్యంత సుందరంగా ముస్తాబుచేశారు. రంగురంగుల పూలు, విశిష్ట బంగారు ఆభరణాలు అమ్మవారికి అలంకరించారు. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలనుంచి సుమారు 65 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి చంద్రమౌళి తెలిపారు. వివిధ సేవా టికెట్ల విక్రయాల ద్వారా ఒక్క రోజులోనే రూ.12.45 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. ఆలయం వద్ద ఎటు చూసినా భక్తులతో కిటకిటలాడింది. క్యూలన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. గంటల తరబడి వేచి ఉండి అమ్మవారిని దర్శించుకున్నారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు కుటుంబ సమేతంగా, బంధుమిత్రులతో కలిసి అమ్మవారికి జంతు బలులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పూజల అనంతరం ప్రతి భక్తుడికి అమ్మవారి తీర్థప్రసాదంతోపాటు, పుష్పం, కుంకుమను అందేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. కొండ పైనుంచి కింది వరకు భక్తులు తీసుకొచ్చిన వాహనాలతో ట్రాఫిక్‌ స్తంభించిపోయింది. ఎస్‌ఐ రవి కుమార్‌ ఆధ్వర్యంలో పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంతోపాటు, అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు.

పోలీసులపై టీడీపీ నేత అనుచరుల వీరంగం

కుప్పం: పట్టణంలోని జేపీ రోడ్డులో ఆదివారం రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణను నివారించేందుకు వెళ్లిన పోలీసులపై టీడీపీ నేత అనుచరులు దుర్భాషలాడుతూ నానాహంగామా చేయడం స్థానికంగా కలకలం రేపింది. పోలీసుల కథనం.. పట్టణంలోని జేపీ రోడ్డులో నివసిస్తున్న మూర్తి కుమారుడికి, లక్ష్మీపురానికి చెందిన మణి కుమార్తెకు రెండేళ్ల క్రితం వివాహ నిశ్చితార్థమైంది. తర్వాత మూర్తి కుటుంబ సభ్యులు వివాహాన్ని వ్యతిరేకించారు. అప్పటి నుంచి ఇరు కుటుంబాల మధ్య వివాదాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి డబ్బావాళ్ల సామాజిక వర్గానికి చెందిన టీడీపీ 11వ వార్డు కౌన్సిలర్‌ కస్తూరి ఇంట్లో పంచాయితీ నిర్వహించారు. ఇందులో నిశ్చితార్థం ముగిసిన తర్వాత వివాహం చేసుకోలేదని, తన కుమార్తె అన్యాయం అయిపోయిందని మణి ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై డబ్బావాళ్లకు చెందిన కుల పెద్దలు చేపడుతున్న రాజీ ప్రయత్నంలో ఇరువురి మధ్య ఘర్షణలు తలెత్తాయి. ఇవి తీవ్రం కావడంతో సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈక్రమంలో పోలీసులు, టీడీపీ కౌన్సిలర్‌ కస్తూరి భర్త వేలుకు వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి. ఆపై టీడీపీ నేత వేలు, తన తనుచరులు పోలీసులపై దురుసుగా ప్రవర్తించారు. దీనిపై స్పందించిన పోలీసు యంత్రాంగం కౌన్సిలర్‌ భర్త వేలును అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.



అంతర్రాష్ట్ర బైక్‌ దొంగ అరెస్టు

తవణంపల్లె: చిత్తూరు సర్కిల్‌ పరిధిలో ద్విచక్ర వాహనాలు చాకచక్యంగా తాళాలు తీసి దొంగలించే అంతర్రాష్ట్ర దొంగను అరెస్టు చేసి, రూ.20 లక్షల విలువ చేసే 22 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొన్నట్లు చిత్తూరు రూరల్‌ సీఐ రవిశంకర్‌ రెడ్డి తెలిపారు. ఆదివారం తవణంపల్లె పోలీస్‌ స్టేషన్‌లో నిందితుడిని అరెస్టు చూపారు. సీఐ రవిశంకర్‌ రెడ్డి మాట్లాడుతూ చిత్తూరు సర్కిల్‌, పరిసర మండలాల్లో ద్విచక్ర వాహనాలు చోరీకి గురైనట్లు పిర్యాదులు అందినట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఎస్పీ రిశాంత్‌ రెడ్డి ఆదేశాల మేరకు డీఎస్పీ శ్రీనివాసమూర్తి పర్యవేక్షణలో చిత్తూరు రూరల్‌ సీఐ రవిశంకర్‌ రెడ్డి ఆధ్వర్యంలో తవణంపల్లె ఎస్‌ఐ సుధాకర్‌ రెడ్డి సిబ్బందితో కలసి మండలంలోని పట్నం బైపాస్‌ హైవేలో వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తిని పట్టుకున్నారు. విచారించగా, అతను యాదమరి మండలం గుట్టకింద దళితవాడకు చెందిన సి.శివరాజ్‌ కుమారుడు సి.గోవిందరాజ్‌(29)గా తేలింది. పూర్తి స్థాయిలో విచారణ చేపట్టడంతో తవణంపల్లె మండలంలో ఆరు బైక్‌లు, బంగారుపాళెంలో రెండు, చిత్తూరు 1వ టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో రెండు, గంగాధరనెల్లూరులో రెండు, ఎస్‌ఆర్‌ పురంలో రెండు, వివిధ ప్రాంతాల్లో మరో 8 బైక్‌లు చోరీ చేసినట్లు వెల్లడించారు. వివిధ కంపెనీలకు చెందిన 22 మోటారు సైకిళ్లు సుమారు రూ.20 లక్షల విలువ చేస్తాయని పేర్కొన్నారు. నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు పలు చోట్ల దాచిన 22 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వివరించారు. పట్నం బైపాస్‌ రోడ్డులో గోవిందరాజ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో విశేష కృషి చేసిన ఎస్‌ఐ సుధాకర్‌ రెడ్డి, కానిస్టేబుళ్లు కె.సుధాకర్‌, గౌతం, రాజాకు రివార్డులు అందజేశారు.





నిందితుడిని అరెస్టు చూపుతున్న పోలీసులు, సిబ్బందికి రివార్డులు అందజేస్తున్న సీఐ రవిశంకర్‌ రెడ్డి

సరికొత్తగా రైల్వే సిగ్నలింగ్‌

- అరక్కోణం నుంచి రేణిగుంట వరకు కేబుల్‌ పనులు
- 70 కిలోమీటర్ల మేరకు నూతన కేబుల్‌ అమరిక

నగరి : రైళ్ల రాకపోకలను రైల్వేస్టేషన్ల వద్ద సిగ్నలింగ్‌ వ్యవస్థ నిర్దేశిస్తుంది. పట్టాలపై రైలు ఉన్నట్లు సిగ్నల్‌ స్టేషన్‌కు అందితేనే మరో రైలు ఆ పట్టాలపై రానీయకుండా చేయవచ్చు. సిగ్నల్స్‌ అందకుంటే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువ. ఇటీవల ఒడిశాలో ఒకే ట్రాక్‌పై రైళ్లు రావడంతో భారీ ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. అలాంటి సంఘటనలు పునరావృతం కాకూడదని రైల్వేశాఖ పటిష్ట చర్యలను చేపట్టింది. రేణిగుంట, అరక్కోణం స్టేషన్ల మధ్య సిగ్నల్స్‌ ఏర్పాటుచేసి సుమారు 20 ఏళ్లకు పైగా అవుతోంది. ఈ కేబుళ్లకు కాలం చెల్లిపోవడంతో సిగ్నల్స్‌ అందడంలో సమస్యలు తలెత్తే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం సిగ్నలింగ్‌ వ్యవస్థను పునరుద్ధరించే ప్రక్రియకు రైల్వేశాఖ శ్రీకారం చుట్టింది. ఈ పనులు ప్రస్తుతం వేగంగా జరుగుతున్నాయి. వీటికి కావలసిన వివిధ రకాల కేబుళ్లు, జంక్షన్‌ బాక్సులు పెద్ద ఎత్తున నగరి పట్టణంలోని కాకవేడు రోడ్డులో ఇప్పటికే డంప్‌చేశారు. అరక్కోణంనుంచి, రేణిగుంట స్టేషన్‌ వరకూ రెండు వైపులా పనులు ప్రారంభమయ్యాయి. ఈ కేబుల్‌ పనులు ప్రస్తుతం నగరి పుత్తూరు పట్టణాల మధ్య ముమ్మరంగా సాగుతున్నాయి. గతంలో ఉన్న కేబుళ్లతో సంబంధం లేకుండా నూతన కేబుళ్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనుల్లో భాగంగా ట్రాక్‌ సమీపం ఒక మీటరు వరకు భూమిని తవ్వి కేబుళ్లను ఏర్పాటు చేయడంతో పాటు నిర్దేశిత ప్రాంతాల్లో సిగ్నల్‌ కంట్రోల్‌ రూమ్‌లు నిర్మిస్తున్నారు.



నగరిలో డంప్‌ చేసిన సిగ్నల్‌ కేబుళ్లు

కొనసాగుతున్న పనులు

కేబుల్‌ లేయింగ్‌, పవర్‌ సప్లయ్‌, రిలే ఇంటర్‌లాకింగ్‌, ఎలక్ట్రానిక్‌ ఇంటర్‌లాకింగ్‌, భూకంపాలు, మెరుపుల నుంచి రక్షణ చర్యలు, కంట్రోల్‌ రూమ్‌ నిర్మాణం, అవుట్‌డోర్‌ సిగ్నల్‌, టెలికాం పనులు వరుస క్రమంలో కేబుళ్ల అమరిక ప్రక్రియ జరగనుంది.

పలువురికి ఉపాధి

సిగ్నల్‌ కేబుళ్ల పనుల్లో భాగంగా ఒక్కో గుంత త్వకానికి నలుగురికి, పిల్లర్లు (దిమ్మెలు) వేయడానికి 16 మందికి, బాక్సులు వేయడానికి 8 మందికి, పెయింటింగ్‌కు నలుగురికి, పైపుల అమరికకు 18 నుంచి 20 మందికి చొప్పున ఒక రోజుకు 50 మందికి పనిదొరుకుతోంది. 10 కిలోమీటర్లకు 3 నెలల సమయం పడుతుండడంతో ఈ ప్రాంతం వారికి అప్పటివరకు ఉపాధి లభించే అవకాశం ఉంది. ప్రస్తుతం దిమ్మెలు ఏర్పాటు చేయడం వరకు పూర్తయింది. బాక్సులు అమరిక మొదలుకానుంది. ఐదు నెలల్లో పనులు పూర్తి చేయాలన్న లక్ష్యంతో ఉన్నట్లు రైల్వే అధికారులు వెల్లడించారు.



డంప్‌చేసి ఉన్న సిగ్నల్‌ బాక్సులు

పటిష్టంగా సిగ్నల్‌ కేబుళ్ల అమరిక

గతంలో ఉన్న సిగ్నల్‌ కేబుళ్లకు గడువు ముగిసిపోతున్నందున నూతన కేబుళ్లను ఏర్పాటు చేస్తున్నాం. గతంలో ఉన్న వాటికంటే పటిష్టమైన సిగ్నలింగ్‌ వర్క్‌ సాగుతోంది. మరో ఐదు నెలల్లో పని పూర్తవుతుందని అంచనా వేస్తున్నాం. ప్రస్తుతం నగరి, పుత్తూరు పట్టణాల మధ్య పనులు వేగంగా సాగుతున్నాయి.

- శ్యామ్‌, సిగ్నల్‌ వర్క్‌ నగరి ఇన్‌చార్జి.